క్లుప్తంగా

గొబ్బిదేవతకు పుర ఉత్సవం



పుర వీధుల్లో ఊరేగుతున్న గొబ్బి దేవత

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని గొబ్బిదేవతకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవత ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యవర్గం



మాధవీలతను సన్మానిస్తున్న ఉద్యోగులు

రేణిగుంట : సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ రేణిగుంట బ్రాంచి-2 చైర్మన్‌గా మాధవీలత, వైస్ చైర్మన్‌గా మనోహర్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజనల్ అధ్యక్షుడు బాబు పర్యవేక్షణలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్మికుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని చైర్మన్ మాధవీలత పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, వేదమూర్తి, గిరిధర్‌కుమార్, బ్రాంచి నాయకులు రాజన్, విజయ్ కుమార్, రూపేష్, ప్రదీప్, శివకుమార్, రాఘవ పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఈఈ వాసుదేవరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల్లోని లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు ఈఈ వాసుదేవరెడ్డికి విన్నవించారు. శనివారం ఉప కేంద్రం వద్ద వినియోగ దారుల పరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. పగటి పూట నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఇవ్వాలని, త్వరితగతిన జగనన్న లే అవుట్‌లోని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. విద్యుత్ సేవలు, వాడకం , ప్రమాదాల నివారణపై డిప్యూటీ ఈఈ సుధాకర్, ఏఈ చలపతి అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా పీఎం సోలార్ సూర్య ఘర్ పథకంలో ఉచితంగా సోలార్ ప్యానల్ ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊరందూరు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని ఊరందూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు హిందీ ప్రచార సభ నిర్వహించిన నాగరీ బోధ్, ప్రవేశ, ప్రథమ, మధ్యమ, ఉత్తమ పరీక్షలలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి వెల్లడించారు. పాఠశాలలో శనివారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, హిందీ పండిట్ మల్లికార్జునను అభినందించారు. పాఠశాల నుంచి 32 మంది హాజరైన ఈ పరీక్షలో అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని, 9వ తరగతి విద్యార్థులైన చరణ్ కుమార్, శరణ్య, జ్యోతి ఉత్తమ పరీక్షలలో 90 మార్కులతో జిల్లా స్థాయిలో సంయుక్తంగా ద్వితీయ ర్యాంకును సాధించారని తెలిపారు.

రేషన్ కార్డులు ఇప్పించండి

సత్యవేడు : పంచాయతీ పరిధిలో నివసిస్తున్న 8 కుటుంబాల గిరిజనులకు రేషన్ కార్డులు 13 కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరారు. శనివారం మండలంలోని మదనంబేడు పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో రేషన్ కార్డులు , ఇంటి స్థలాలపై రెవెన్యూ అధికారులకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సుబ్రమణ్యం, సెక్రటరీ మాధవి, మండల సర్వేయర్, చంద్రశేఖర్, సచివాలయ సర్వేయర్ షణ్ముగం, నాయకులు వీకేఎస్ పరమశివం (బాషా), ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నాగార్జున, మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

సత్యవేడు: మండలంలోని అలిమేలు మంగాపురంలో వెంకటముని అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మూడు రోజుల క్రితం వెంకటముని తన కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఇంటికి రాగా, చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో దాచిన రూ.55వేల నగదు, నాలుగు సవర్ల బంగారం, 100 గ్రాముల వెండి, సెల్‌ఫోన్ అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు.



మంచినీళ్లగుంట ముఖద్వారం



పార్కు చుట్టూ పిచ్చిమొక్కల పొదలు

పార్కులపై పట్టింపేది?

- అధ్వానంగా మంచినీళ్ల గుంట పార్కు
- నిఘా కరువు.. నిర్వహణ బరువు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ప్రారంభానికి నోచుకోని దుకాణాలు

రేణిగుంట వాసులకు ఆహ్లాదం కరువవుతోంది. నిర్వహణ లోపంతో పార్కు చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో నిండిపోయింది. సేద తీరే బల్లలు ముళ్లపొదల్లో కలిసిపోతున్నాయి. కనీసం వాకింగ్ చేద్దామన్నా ట్రాక్ సైతం ఎక్కడబడితే అక్కడ దెబ్బతింది. పైగా ముళ్లపొదల నుంచి ఎటు వైపు నుంచి పాములొస్తాయోనని భయాందోళన మధ్య గడపాల్సిన దుస్థితి నెలకొంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన దుకాణాలు అందుబాటులోకి తీసుకురాలేదు. ఫలితంగా రేణిగుంటలోని మంచినీళ్లగుంట పార్కు అధికారుల నిర్లక్ష్యానికి బలవుతోంది.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంటలోని మంచినీళ్ల గుంట పార్కు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి విష పురుగులకు నిలయంగా మారింది. పార్కును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తుడా అధికారులతో మాట్లాడి రూ.40 లక్షలు వ్యయంతో పార్కును అభివృద్ధి చేశారు. గుంటలో పిచ్చిమొక్కలు , ముళ్లపొదలు తొలగించి, చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించారు. పట్టణ వాసులు సేద తీరేందుకు చుట్టూ రాతి బండలతో బల్లలు ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట వస్తువులు సమకూర్చారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా తుడా నిధులతో మూడు దుకాణ సముదాయాలను నిర్మించారు.

నిర్లక్ష్య ధోరణి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మంచినీళ్ల గుంట పార్కుపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో మంచినీళ్ల గుంటలో పిచ్చిచెట్లు, ముళ్ల కంపలు మొత్తం విస్తరించాయి. దీంతో పాములు, విష పురుగులు ఉండటంతో వాకింగ్ చేసే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ భయంతో కొంత మంది వాకింగ్ చేయడానికే రావడం మానేశారు. నిర్వహణ లోపంతో వాకింగ్ ట్రాక్ అనేక చోట్ల మరమ్మతులకు గురైంది. మంచినీళ్ల గుంటకు ఆనుకొని మండల పరిషత్ కార్యాలయం ఉన్నా అధికారులు పార్కుపై శ్రద్ధ పెట్టకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.

అందుబాటులోకిరాని దుకాణాలు

గత ప్రభుత్వంలో తుడా నిధులతో మూడు దుకాణ సముదాయాలు నిర్మించారు. 2024 మార్చిలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వ్యాపార సముదాయాలను ప్రారంభించారు. కానీ నేటికీ ఆ దుకాణాలు అందుబాటులోకి తీసుకురాలేదు. దుకాణాలకు వేలం నిర్వహిస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. కానీ అలాంటి ఆలోచనలే పంచాయతీ అధికారులు చేయడం లేదు. దుకాణ సముదాయానికి వచ్చే ఆదాయంతోనే మంచినీళ్ల గుంట నిర్వహణ చేయవచ్చని స్థానికులు అంటున్నారు.



బల్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

దోమల కేంద్రంగా బుగ్గ కొలను

మంచినీళ్ల గుంటకు అనుసంధానంగా ఉన్న బుగ్గ కొలను దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. శివుడి విగ్రహం ఉండి భక్తుల నుంచి పూజలు అందుకుంటున్న బుగ్గ ప్రస్తుతం మురుగు నీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. బుగ్గ లోతట్టులో ఉండటంతో వర్షపు , మురుగు నీరు చేరి దోమలకు నిలయంగా మారింది.

వాకింగ్‌ట్రాక్‌కు మరమ్మతులు చేయాలి



వాకింగ్ ట్రాక్ అక్కడక్కడా దెబ్బతింది. అందువల్ల నడిచేటప్పుడు పడిపోయే ప్రమాదం ఉంది. బుగ్గలో మురుగు నీరు ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. చుట్టు పక్కల నివాసం ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పంచాయతీ అధికారులు బుగ్గను శుభ్రం చేయాలి.

- నసీంబేగం , రేణిగుంట

వాకింగ్ చేయాలంటే భయం




గుంటలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు అధికంగా ఉన్నాయి. అందువల్ల పాములు, విష పురుగులు వాకింగ్ ట్రాక్‌పైన వస్తుండటంతో వాకింగ్ చేయాలంటేనే భయంగా ఉంది. అధికారులు స్పందించి మంచినీళ్ల గుంటను అభివృద్ధి చేయాలి.

- చిన్న అమ్ములు, రేణిగుంట



నిర్వహణ లోపంతో దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్



మురుగు నీటితో బుగ్గ కొలను



మూతపడిన వ్యాపార సముదాయాలు

రూ.11.40 లక్షల ఎంపీ నిధులు విడుదల

నారాయణవనం : మండలంలోని 15 పంచాయతీల్లో వీధి దీపాల ఏర్పాటుకు ఎంపీ మద్దిల గురుమూర్తి తన నిధుల నుంచి రూ.11.40 లక్షలను మంజూరు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు స్పందించిన ఎంపీ గురుమూర్తి వీధి దీపాలను ఏర్పాటు చేయడానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులను మంజూరు చేశారని తెలిపారు. మండలంలోని కొండలచెరువు, ఎరికంబట్టు, తిరువట్యం, జీఎస్ కండ్రిగ, నైనారుకండ్రిగ, తుంబూరు, పాలమంగళం సౌత్, పాలమంగళం నార్త్, కల్యాణపురం కసిమిట్ట, వీకే పాళ్యం పంచాయతీలకు రూ.90 వేల చొప్పున వీధి దీపాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారన్నారు. అలాగే డీకే పాళ్యం, బ్రాహ్మణతాంగాళ్, వెత్తలతడుకు, సముదాయం పంచాయతీలలో వీధి దీపాల ఏర్పాటుకు రూ.50 వేల చొప్పున మంజూరు చేశారని తెలిపారు. నిధులు విడుదల చేసిన ఎంపీ గురుమూర్తికి ఈ సందర్భంగా స్థానిక నేతలు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.57 వేలకు ఏర్పేడు చేపల చెరువు

రేణిగుంట (ఏర్పేడు) : మండల కేంద్రమైన ఏర్పేడు చెరువులో చేపలు వదిలేందుకు అధికారులు శనివారం పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. ఏర్పేడు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు బొడుగు గురవయ్య యాదవ్ అధ్యక్షతన, సర్పంచ్ నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో చెరువు వేలంపాట నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ రమణకుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేలంలో ఏర్పేడు అశోక్‌నగర్‌కు చెందిన రమేష్ రూ.57,689కు చేపల చెరువు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

నేడు కొల్లడంలో ఉచిత వైద్యశిబిరం

సత్యవేడు : మండలంలోని కొల్లడం పంచాయతీలో ఆదివారం పుత్తూరు గుడ్ షెఫర్డ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల సిబ్బంది తెలిపారు. విదేశీ వైద్యుల పర్యవేక్షణలో పేదలకు వైద్యసేవలు, ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు అందిస్తారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

పంట కాలువ ఆక్రమణ తొలగింపు



ఆక్రమణకు పాల్పడిన వ్యాపారితో మాట్లాడుతున్న వీఆర్వో మాధవి

వరదయ్యపాళెం : మండలంలోని బత్తలవల్లంలో ఓ వ్యాపారి ఏకంగా పంట కాలువను ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మాణానికి సిద్ధమయ్యాడని రైతులు, గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ తక్షణమే అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానిక వీఆర్వోను ఆదేశించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వీఆర్వో మాధవి పంట కాలువపై అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును తొలగించి కాలువ వద్ద ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజలు

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధి గాంచిన శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం శని ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, ఆలయంలోని నందీశ్వర స్వామికి శ్రీ వాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పుజలు చేశారు. ఈ ప్రదోష పూజలు, ప్రసాదాలు, మూలవిరాట్, పరివార దేవతామూర్తులకు ప్రత్యేక పుష్ప అలంకరణకు ఉభయదాతలుగా శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి ఉభదారులుగా వ్యవహరించారు. వాసుదేవన్ నాదాలయ భరతనాట్యం గురువులు తులసి వారి ఆధ్వర్యంలో భరతనాట్యం ఆకట్టుకుంది. ఆలయ కార్య నిర్వాహణాధికారి పి.లత , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తలుపులు పగలగొట్టి చోరీ



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

శ్రీకాళహస్తి రూరల్(రేణిగుంట): రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ ఆర్. అగ్రహారం దళితవాడలో నివసిస్తున్న జ్యోతమ్మ అనే మహిళ ఇంటి తలుపులు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు..

జ్యోతమ్మ ఆమె కుమారుడు పథ్వీరాజ్, కోడలు నివాసం ఉంటున్నారు. కోడలు కాన్పుకు పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో క్రిస్మస్ రోజున జ్యోతమ్మ కూడా పుత్తూరు మండలం తడుకులోని తన పుట్టింటికి కుమారుడితో కలిసి వెళ్లింది. శనివారం ఉదయం 11 గంటలకు ఊరు నుంచి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లోని 30 సవర్ల బంగారు నగలు, రూ.3లక్షల నగదు, పది పట్టుచీరలు అపహరణకు గురైనట్లు తెలిసింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి తమ సిబ్బందితో వచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పట్ల పంపిణీ

వరదయ్యపాళెం : వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సామాజిక కార్యకర్త శ్రీనివాసులు తన మనవరాలు వసుధ జన్మదినం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు శనివారం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ బసిరెడ్డి, ఉపసర్పంచ్ చంద్రబాబు, వార్డు సభ్యులు మునిభూషణమ్మ, సిద్దులయ్య, కుమార్ ఉన్నారు.

గంజాయి పట్టివేత

- ఆరుగురి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరదయ్యపాళెం: గంజాయి తరలిస్తున్న ఆరుగురు యువకులను శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ కేబీ మల్లికార్జున తెలిపారు. మండలంలోని కారిపాకం సమీపంలో ఉన్న ఓ రైస్ మిల్లు వద్ద గంజాయితో ఉన్న తడ మండలానికి చెందిన ఏ. విఘ్నేష్ (21), పి. అరసు (45), బి. అజిత్ కుమార్ (23), పి. నరేంద్ర (29), బీఎన్‌కండ్రిగ మండలానికి చెందిన వెట్టి సురేష్ (22), అన్నవరానికి చెందిన రాజాను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి రూ. 72లక్షలు విలువ చేసే 6 కేజీల గంజాయి, రూ. 50వేల విలువైన ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దాడిలో పోలీస్ సిబ్బంది సాయిబాబా, సుబ్రమణ్యం, హరిప్రసాద్, గణేష్, ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

నష్టపోయిన గిరిజనులకు పరిహారం



అనుభవదారు పట్టాలు, ఇంటి పన్ను చూపిస్తున్న బాధితులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దళిత గిరిజనులకు సంబంధించిన ఇళ్లను కూల్చివేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బాధ్యత వహించి నష్టపోయిన దళిత గిరిజనులకు 3 సెంట్ల స్థలం ఇంటి పట్టాలు, హౌసింగ్ ఇల్లు మంజూరు చేయాలని దళిత గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. రేణిగుంట మండలంలో గత వారంలో చెంగారెడ్డిపల్లి, కుర్ర కాలువ గ్రామాల్లో దళిత గిరిజనులు గత ప్రభుత్వంలో రెవెన్యూ అనుమతితో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసిన ఘటనను ఖండిస్తూ శనివారం మండలంలోని చెంగారెడ్డిపల్లి రామాలయం వద్ద చెంగారెడ్డిపల్లి-కుర్ర కాలువ ఇళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మద్దతుగా ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి సెల్వరాజ్, ఆదర్శ మాలల ఐక్యవేదిక తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నాగరాజు, ఏపీడబ్ల్యూజేఎస్ తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షుడు హరి, జిల్లా ఇన్‌చార్జి లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు హేమాద్రి, ఐద్వా మండల నాయకురాలు సత్యశ్రీ, దీప, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం మండల కార్యదర్శి ఈశ్వరమ్మ, మండల అధ్యక్షుడు చీరాలయ్య, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి రాజశేఖర్, కట్ట పుట్టలమ్మ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, చెంగారెడ్డిపల్లి గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేణుకమ్మ, సంపూర్ణ పాల్గొన్నారు. సమావేశంలో హరినాథ్ మాట్లాడుతూ.. అక్రమ కూల్చివేతకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి బాధ్యత వహించాలన్నారు. రూ.2 లక్షల నుంచి 4 లక్షలు అప్పులు చేసి కట్టుకొన్న ఇళ్ల కూల్చివేత వలన నష్టపోయిన దళిత గిరిజనులకు ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్ర నాయుడు

రేణిగుంట(ఏర్పేడు) : రైతులకు రబీ సీజన్‌లో సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచుతామని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఏర్పేడు విద్యుత్ కార్యాలయంలో శనివారం జరిగిన రైతు సదస్సులో పాల్గొని రైతు సమస్యలపై చర్చించారు. లోఓల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు, 11 కేవీ లైన్లు, సబ్‌స్టేషన్ మరమ్మతులు, ఫీడర్ మరమ్మతుల గురించి రైతులు వివరించారు. అలాగే లోఓల్టేజీ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందన్నారు. అన్ని ఫీడర్లు పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు. బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ఏఈ వాసుదేవయ్యకు సూచించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏడీఈ సుబ్రహ్మణ్యం,శ్రీకాళహస్తి ఏఏఓ నాగేశ్వరరావు, ఏర్పేడు ఏఈ వాసుదేవయ్య, జేఈ రుతిక పాల్గొన్నారు.



ఆస్పత్రి ప్రాంగణం అంధకారం

రేణిగుంట ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది. పట్టణంలోని వైద్యశాల 24 గంటల ఆస్పత్రిగా సేవలందిస్తోంది. కానీ రాత్రిళ్లు ఆసుపత్రికి వెళ్లాలంటే చిమ్మ చీకటిలో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రి ప్రాంగణం చీకట్లు కమ్ముకోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో జరిగిన మండల సమావేశంలో వీధి దీపాల సమస్యను వైద్యాధికారి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం. శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

రైతుల వినతులు



వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం : మండలంలోని ఇందిరానగర్ ఇంటి స్థలాలకు గ్రామ కంఠంగా సర్టిఫికెట్లు ఇవ్వాలని స్థానికులు తహసీల్దార్ రాజశేఖర్‌కు విన్నవించారు. సీఎల్ఎన్‌పల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే ముస్లింపాళెం గ్రామస్తులు శ్మశానవాటిక పేరును అరబిక్ మథర్‌సాగా నమోదు చేయాలని సర్పంచ్ అబ్దుల్ మజీద్ స్థానికులతో కలసి విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ వేణు పాల్గొన్నారు.

వైరల్‌గా అత్తాకోడళ్ల గొడవ

శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజ ఎస్టీకాలనీలో అత్తాకోడళ్ల గొడవ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. భర్త చనిపోవడంతో ఓ మహిళ పుట్టింటికి వెళ్లి తిరిగి వచ్చింది. అయితే ఆమెను ఇంట్లోకి రానివ్వకుండా అత్త, ఆడపడుచు దాడి చేశారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.